ప్రజాశక్తి
శనివారం 27 డిసెంబర్ 2025 5 అనంతపురం



మహాసభల కోసం సిఐటియు జీపుజాతా



అనంతపురంలో జాతాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

- అఖిల భారత సిఐటియు మహాసభల విజయవంతం కోరుతూ జిల్లా వ్యాప్తంగా పర్యటన
- మద్దతుగా కదిలొచ్చిన కార్మికలోకం
- జాతా పర్యటన ప్రాంతాల్లో కార్మికుల నుంచి స్పందన
- 4న బహిరంగ సభలో పాల్గొంటాం : కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అఖిలభారత సిఐటియు మహాసభల విజయవంతం కోరుతూ జిల్లాలో ఆ సంఘం ఆధ్వర్యంలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం నాడు జీపుజాతాను ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ జాతా జిల్లా అంతా పర్యటించి కార్మికులను సమీకృతం చేయనుంది. మహాసభల ఆవశ్యకతను తెలియజేయడంతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై జాతా ద్వారా నాయకులు వివరించారు. జిల్లాలో జాతా వెళ్లిన ప్రతి ప్రాంతంలోనూ కార్మికులు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. స్వచ్ఛందంగా కార్మికులు జాతా బృందానికి మద్దతు తెలుపుతూ స్వాగతం పలికారు. కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం సిఐటియు చేస్తున్న పోరాటాలు, కార్యక్రమాలను అభినందిస్తూ తామూ మహాసభల్లో పాల్గొంటామంటూ తెలియజేశారు. 4వ తేదీన విశాఖలో జరిగే బహిరంగ సభలో పాల్గొని కార్మికుల సత్తా చాటుదామన్నారు.

అనంతపురం నగరం ప్రభుత్వ సర్వజానాసుపత్రి వద్ద నిర్వహించిన జీపుజాతా కార్యక్రమాన్ని సిఐటియు జిల్లా నాయకులు మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర నాయకులు లక్ష్మీనరసమ్మ, మంత్రి వరలక్ష్మి, ఏపి మెడికల్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు నల్లమ్మ, భగత్‌సింగ్ ఆటో యూనియన్ నాయకురాలు స్వాతిలు హాజరై జెండా ఊపి జీపుజాతాను ప్రారంభించారు. జాతా అనంతపురంలో ప్రారంభమై బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, తాడిపత్రి, యాడికి, రాయలచెరువు, గుత్తి, గుంతకల్, వజ్రకరూరు, ఉరవకొండకు చేరుకుంది. ఆయా ప్రాంతాల్లో కార్మికులు వందలాదిగా హాజరై జాతాను జయప్రదం చేశారు.

కార్మికులకు అండగా సిఐటియు

జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్

కార్మికుల హక్కులను కాపాడేందుకు వారికి అండగా సిఐటియు నిలుస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వి.నాయుడు, ఎస్.నాగేంద్రకుమార్ తెలిపారు. జీపుజాతా ప్రారంభం సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికులను వెట్టిచాకిరీలోకి నెట్టి శ్రమదోపిడికి గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం అన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక లోకం లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తున్నా ఏకపక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల 31, జనవరి 1, 2, 3, 4వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరుగుతున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చలు నిర్వహిస్తారన్నారు. 4వ తేదీన జరిగే బహిరంగ సభలో కార్మికులందరూ పెద్ద ఎత్తున హాజరై మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. సిఐటియు ఉపాధ్యక్షులు మన్నీల రామాంజినేయులు, టి.గోపాల్, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, నగర ఉపాధ్యక్షులు లతీఫ్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటిఎం.నాగరాజు, నగర కార్యదర్శి తిరుమలేష్, రవాణా రంగం కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జిలాన్, అక్బర్, ఆటో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఆజాం బాషా, ఎన్టీఆర్.శ్రీనివాసులు, ప్రభుత్వ సర్వజనాసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పిల్లల బరువు, ఎత్తుపై దృష్టి సారించండి

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వచ్చే ఆరు నెలల్లో వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు, అతి తక్కువ బరువు ఉన్నవారు ఎవరూ ఉండరాదని, పిల్లలందరి ఆరోగ్యం మెరుగుపడేలా ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో శుక్రవారం శ్రీవడు జిల్లా మహిళా, శిశు అభివృద్ధి శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐసిడిఎస్ పరిధిలో జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు 37, సహాయకులు 81 ఖాళీల భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చామని నిబంధనల మేరకు వాటి భర్తీకి తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లల కేసులను ఎప్పకప్పుడు పరిశీలించాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. 0-5 ఏళ్లలోపు పిల్లలకు సంబంధించి వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలు అక్టోబర్ నెలలో 2,531 కేసులు ఉండగా, నవంబర్ నెలకు 1,788 కేసులకు తగ్గాయన్నారు. బరువుకు సంబంధించి అక్టోబర్ నెలలో 904 కేసుల నుంచి నవంబర్ నెలకు 701 కేసులకు తగ్గాయన్నారు. పూర్తిగా బరువు తక్కువగా ఉన్న కేసులకు సంబంధించి అక్టోబర్ నెలలో 891 కేసులు ఉండగా, నవంబర్ నెలకు 671 కేసులకు తగ్గాయన్నారు. ఇదే విధంగా కష్టపడి పని చేస్తే రానున్న ఆరు నెలల కాలంలో వీటిలో మరింత మెరుగుదల వస్తుందని తెలియజేశారు. ఇలాంటి పిల్లల విషయంలో సిడిపిఒలు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లల ఆరోగ్యం మరింత మెరుగుపడేందుకు సీడీపీవోలు, సూపర్ వైజర్లు నూతన సాంకేతికత ఆలోచనలు ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు వందరోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా రూపొందించిన "బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్" అనే పోస్టర్‌ను, అనంతపురం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో భారత్ బాలశక్తి ఏ 2047, "వీర్ బాల్ దివస్" 2025 వేడుకలకు సంబంధించిన పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పీడీ అరుణకుమారి, జిల్లా మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి కోఆర్డినేటర్ డా॥బిఎన్.శ్రీదేవి, డిసిపిఒ మంజునాథ్, సిడిపివోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మహిళల కోసం సఖి వన్‌స్టాప్ సెంటర్ : కలెక్టర్



సఖివన్ స్టాప్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో హింసకు గురవుతున్న మహిళలు సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలియజేశారు. అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనం వద్ద సఖి వన్ స్టాప్ సెంటర్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న సమాజంలో హింసకు గురవుతున్న మహిళలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సఖి వన్ స్టాప్ సెంటర్‌ను అనంతపురం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చన్నారు. మహిళలకు ఉమెన్ హెల్ప్ లైన్ 181 కూడా ఉచితంగా ఉందని తెలిపారు. సఖీ వన్ స్టాప్ సెంటర్‌లో మహిళలకు ఉచితంగా కౌన్సిలింగ్ న్యాయ సహాయం, పోలీసు సహాయం, వైద్య సహాయం, షెల్టర్ కూడా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ఈ.అరుణకుమారి, జిల్లా మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ డా॥బిఎన్.శ్రీదేవి, డిసిపిఒ మంజునాథ్ పాల్గొన్నారు.

తుపాకుల విక్రేతలు అరెస్ట్

నిందితుల్లో ఒకరు అనంత, ఇద్దరు మధ్యప్రదేశ్ వాసులు - 5 కంట్రీ మేడ్ పిస్టోళ్లు, 7 మ్యాగజైన్ లు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం

అక్రమంగా తుపాకులు విక్రయించిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అనంత పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు గన్‌ను కొనుగోలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 5 కంట్రీ మేడ్ ఫిస్టోళ్లు, 7 మ్యాగజైన్‌లు, 30 లైవ్ బుల్లెట్లు, 3 ఖాళీ బుల్లెట్ షెల్స్, తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీష్ విలేకరులకు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం మొరేనా జిల్లాకు చెందిన రోహిత్ పర్మార్, శివం సింగ్ పరిహార్ ఇద్దరు తుపాకులను తయారు చేసే విక్రయించేవారు. వీరితో అనంతపురం నగరానికి చెందిన నల్లి రాజశేఖర్ రెడ్డి పరిచయం చేసుకున్నాడు. వీరిలో రోహిత్ పర్మార్ అక్రమ ఆయుధాల కొనుగోలు, నిల్వ, రవాణాలో కీలక పాత్రధారిగా ఉన్నారు. మొరేనా, గ్వాలియర్ ప్రాంతాల నుంచి తుపాకులు కొనుగోలు చేసి దాచిపెట్టడం, తుపాకితో టెస్ట్ ఫైర్ చేయడం లాంటి పనులు చేస్తున్నాడు. అనంతపురానికి చెందిన నల్లి రాజశేఖర్ రెడ్డి స్థానికంగా జిమ్ నిర్వహిస్తున్నాడు. ఇతను మూడు సంవత్సరాల క్రితం పంజాబ్‌లోని జలంధర్‌లో జిమ్ పరికరాలు కొనడానికి వెళ్లాడు. అక్కడ రోహిత్ పర్మార్, శివం సింగ్ పరిహార్ ఏదీరజ్‌లతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో జిమ్‌కు వచ్చే వాళ్లలో ఎవరైనా ఇబ్బంది పెడితే వారిని బెదిరించడానికి గన్ అవసరమని భావించిన నల్లి రాజశేఖర్ రెడ్డి మిగితా ఇద్దరు నిందితులైన రోహిత్ పర్మార్, శివం సింగ్ పరిహార్ ఏదీరజ్‌లతో కలిసి ఒక గన్ కొనుగోలు చేసి, దానిని అతని వద్ద ఉంచుకున్నాడు. నల్లి రాజశేఖర్ రెడ్డి వద్ద అక్రమంగా తుపాకి ఉందని ఇటీవల అనంతపురం 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో పాటు మధ్యప్రదేశ్ నుంచి తుపాకులను తెప్పించి అనంతపురంలో వాటిని విక్రయించి లాభం పొందేందుకు కూడా అతని ప్రణాళిక రచించాడు. ఈ మేరకు పోలీసులు ఈ ముఠాపై నిఘా ఉంచారు. పోలీసులు పక్కా ప్రణాళికతతో నల్లి రాజశేఖర్‌రెడ్డితో పాటు మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ముఠా సభ్యులను అనంతపురం సమీపంలోని ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం నాడు అరెస్టు చేశారు. జన సంచార ప్రదేశాల్లో అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం, వినియోగించడం తీవ్రమైన నేరమని, ఇటువంటి వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వి.శ్రీనివాస రావు, సిఐలు శ్రీకాంత్, రాజేంద్ర నాథ్ యాదవ్, శేషగిరితో పాటు ఎస్ఐలు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గన్‌ను చూస్తున్న ఎస్పీ జగదీష్



ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘంలో పనులు చేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సిఐటియు నాయకులు మల్లికార్జున మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులకు మూడేళ్ల నుంచి బకాయి ఉన్న సరెండర్ సెలవులు ఇవ్వాలని, 3 డిఎలు మంజూరు చేయాలని, కార్మికుల సంఖ్య పెంచాలని, సమ్మె కాలపు వేతనం, మృతిచెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని, పక్కా ఇల్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో మున్సిపల్ యూనియన్ నాయకులు రాము, మల్లేష్, నాగరాజు, తిప్పేరుద్ర, సిద్ధ, రామాంజి, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం : ఎమ్మెల్యే

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం అనిరాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని 17వ వార్డు దుగ్గిలమ్మ గుడి, 21వ వార్డు నర్సోజికుంట వద్ద సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన పురపాలక సంఘం అధ్యక్షురాలు పోరాలు శిల్పతో కలిసి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, తదితర పనులను దశల వారీగా పూర్తి చేస్తూ స్వచ్ఛ, సుందరమైన రాయదుర్గం దిశగా ముందుకెళ్తున్నామన్నారు. ప్రజల ఆశీర్వాదం, సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. బిపిఎస్, ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే దుగ్గిలమ్మ ఆలయానికి వచ్చే భక్తులు, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నర్సోజికుంట ప్రాంతంలో దశాబ్దాలుగా ఉన్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. ప్రధానంగా డిపిఇపి పాఠశాల విద్యార్థులు, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, బురద సమస్యలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ సురేష్, కౌన్సిలర్లు పద్మజ, శ్రీలక్ష్మి, శారద, టిడిపి నాయకులు హనుమంతు, మహబూబ్‌బాషా, నాగరాజు, సంపత్‌కుమారి, భారతి, సుమలత, కిరణ్, కరెన్న, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

పరిశ్రమల స్థాపనకు సహకరిస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ఎస్ఎస్‌బిఎన్‌లో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



జాబ్‌మేళా వచ్చిన విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం నగరంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వం వైపు నుంచి పూర్తి స్థాయిలో సహకారం ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నగరంలో ఎస్-ఎస్‌బిఎన్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 15 కంపెనీల్లో వివిధ స్థాయిల్లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహించగా యువత ఇందులో పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారికి ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించే విధంగా శిక్షణ ఇవ్వడానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్‌ను గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకొచ్చారన్నారు. ఇది గతం కంటే ఇప్పుడు మరింత మెరుగ్గా పని చేస్తోందన్నారు. 18 నెలల కాలంలో 6సార్లు నగరంలో జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగాలు ఇచ్చామని తెలియజేశారు. నగరంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేశామని, ఇక్కడ పరిశ్రమల స్థాపనకు ఎవరు ముందుకొచ్చినా వారికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించే చొరవ కూడా తీసుకుంటామన్నారు.

పిజిఆర్ఎస్ ద్వారా సమస్యల పరిష్కారం వేగవంతం

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం




వినతులను స్వీకరిస్తున్న ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పిఆర్‌జిఎస్) విధానం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. కాలవ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పిజిఆర్ఎస్ సిస్టంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ఫిర్యాదుదారుల నుంచి అందిన అర్జీలపై మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతి దిశలో సమీక్షిస్తున్నందున త్వరగా పరిష్కారం లభిస్తుందన్నారు. నాణ్యమైన పరిష్కార మార్గానికి పిజిఆర్ఎస్ విధానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇప్పటి వరకు తాను నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 463 ఫిర్యాదులు అందగా 207 సమస్యలను పరిష్కరించామన్నారు. మిగిలినవి సంబంధిత అధికారుల పరిశీలనలో ఉన్నాయన్నారు. తాను స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో కొందరు ఫిర్యాదుదారుల ఆధార్ నంబర్లు కర్నాటక ప్రాంతానికి చెందినవి కావడంతో సమస్య తలెత్తుతోందన్నారు. కర్నాటక ఆధార్ నెంబర్ ఉన్న అర్జీలను పిజిఆర్ఎస్‌లో నమోదు చేయడం సాధ్యపడటం లేదన్నారు. అలాంటి వాటిని నేరుగా అధికారులకు పంపుతామన్నారు. వాటిపై సమీక్ష చేసే అవకాశం లేనందున ఫిర్యాదులు చేసేటప్పుడు స్థానికంగా ఆధార కార్డు ఉన్న బంధువుల పేర్లతో ఫిర్యాదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాలు పురుషోత్తం, టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఎడిసిసి బ్యాంకు సేవలు

బ్యాంకు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని, ఛైర్మన్ కేశవరెడ్డి భూమిపూజ

ప్రజాశక్తి-శెట్టూరు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గంలో ప్రాంత రైతులు, ఖాతాదారులకు ఎడిసిసి బ్యాంకు సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. ఎడిసిసి బ్యాంకు కళ్యాణదుర్గం బ్రాంచి నూతన భవన నిర్మాణానికి శుక్రవారం వారు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయినా కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తుందన్నారు. ఈ ప్రాంత పేదల పిల్లల ఉన్నత చదువుల కోసం ఎడ్యుకేషన్ లోన్లు మంజూరు చేయాలన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతాన్ని వరల్డ్ బ్యాంకు హార్టికల్చర్ హబ్‌గా ఎంపిక చేసిన నేపథ్యంలో బిటిపి త్వరగా పూర్తవుతుందనే నమ్మకం మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సురేఖరాణి, చాపిరి సింగిల్‌విండో ఛైర్మన్ మల్లిపల్లి నారాయణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గోళ్ల లక్ష్మీదేవిరమేష్, వైస్‌ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తలారి గౌతమి సోమశేఖర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, యల్లనూరు, బండమీదపల్లి, శెట్టూరు, కంబదూరు, బ్రహ్మసముద్రం సొసైటీల ఛైర్మన్లు అనిల్‌కుమార్, చిత్రలింగప్ప, రంగప్పచౌదరి, బాబయ్య, అంకె ఓబులేష్, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బాల్యం రాజేష్, నాయకులు మల్లారెడ్డి, గోళ్ల వెంకటేషులు, ధనుంజయ, పాలబండ్ల శ్రీరాములు, కురుబ శివన్న, టిఆర్.తిప్పేస్వామి, పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-శెట్టూరు

పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 34 మందికి మంజూరైన రూ. 18.2 లక్షల విలువ చేసే చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదికలో లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేము ఇక్కడి నుంచి పంపే ప్రతి దరఖాస్తును పరిశీలించి పేదలకు ఆర్థికంగా తోడుగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ గోళ్ల లక్ష్మీదేవి రమేష్, వైస్ ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ తలారి గౌతమి సోమశేఖర్, వైస్ ఛైర్మన్ తిమ్మప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, మండల కన్వీనర్లు కురుబ శివన్న, టిఆర్.తిప్పేస్వామి, గోళ్ల వెంకటేషులు, సీనియర్ నాయకులు గాజుల శ్రీరాములు, గురుప్రసాద్, రామ రాజు, దండా వెంకటేషులు, జనసేనపార్టీ ఇన్‌ఛార్జి బాల్యం రాజేష్, అక్కమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ పద్మావతి పాల్గొన్నారు.

పిల్లలే దేశ భవిష్యత్తుకు నిర్మాణకర్తలు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

నేటి పిల్లలే దేశానికి బలమైన రేపటి నిర్మాణకర్తలు అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. శుక్రవారం అనంతపురంలోని తన నివాసం వద్ద వీర బాలదివస్-2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన సాహస వీరుల త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 26వతేదీన బీర బాలదివస్ కార్యక్రమం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. సిక్ మత గురువు గురు గోబింద్ సింగ్ నలుగురు కుమారులుసాహిబ్జాదే అజీత్ సింగ్, జుజార్ సింగ్, జోరావర్ సింగ్, ఫతే సింగ్‌చూపిన అసమాన ధైర్యం, త్యాగ భావనను దేశం గౌరవంతో స్మరిస్తోందన్నారు. వీర బాల్ దివస్ నిర్వహణ ద్వారా పిల్లలు, యువతలో దేశభక్తి, ధైర్యం, నైతిక విలువలు పెంపొందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం అంగన్వాడీలకు 5జి మొబైల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల ఐసిడిఎస్ సిడిపిఒ లలిత, నార్పల సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్లు కల్పన, వాణిశ్రీ, శ్రీదేవి, నేతాజీ, బి.కౌసల్య, వాణిశ్రీ, అన్నపూర్ణాదేవి, ధనలక్ష్మి, ముంతాజ్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

కబ్జాకు గురైన భూమి పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని చామలూరు పొలంలో ఉన్న 215, 213 సర్వే నెంబర్లలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని ఆర్డీవో కేశవనాయుడు శుక్రవారం పరిశీలించారు. గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఆలూరు ప్రజాసంఘాల నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి ఆర్డీవో మధుసూదన్, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తితో కలిసి భూమిని మొత్తం సర్వే చేసి కబ్జాకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ఎవరైనా కబ్జాలకు పాల్పడితే చర్యలు తప్పవని బోర్డు ఏర్పాటు చేయించారు. కానీ అధికారుల మాటను పెడచెవిన పెట్టిన కబ్జాదారులు తిరిగి ప్రభుత్వ భూమిని కబ్జా చేసి షెడ్డును నిర్మించారు. షెడ్డును పరిశీలించిన ఆర్డీవో కేశవనాయుడు స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. భూమిని ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ ప్రకాష్‌రావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చాములూరు పొలంలో కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవనాయుడు, రెవెన్యూ సిబ్బంది

చెరువులకు నీరివ్వాలని వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులకు హెచ్చెల్సీ నీటితో నింపాలని ఆయా గ్రామాల రైతులు కోరారు. ఈమేరకు ఆయా గ్రామాల రైతులు శుక్రవారం అనంతపురంలోని హెచ్చెల్సీ ఎస్‌సి కార్యాలయంలో ఎస్‌సిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వర్షాలు లేక బోర్లన్నీ అడుగంటిపోయాయన్నారు. హెచ్చెల్సీ నీటితో మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి చెరువులకు సుబ్బరాయుడు సాగర్ నుంచి నీరు విడుదల చేస్తే తాగునీటి సమస్యతో పాటు భూగర్భజలాలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతుల కష్టాలు తెలుసుకుని నీటిని విడుదల చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైతులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, భయపరెడ్డి, వెంకటరాముడు, వీరయ్య, పద్మనాభరెడ్డి, పుల్లారెడ్డి, జయచంద్రారెడ్డి, శేఖర, రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పంపిణీ చేశారు. శింగనమల, ఉల్లికల్లు, సలకంచెరువు, గుమ్మేపల్లి గ్రామ నిరుపేదలకు మంజూరైన రూ.19,55,401 చెక్కులను ఆయా బాధిత కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతీనాయుడు, సీనియర్ నాయకులు డేగల కృష్ణమూర్తి, రంగారెడ్డి, సలకంచెరువు నాగలింగం, యల్లనూరు మండలం దంతాలపల్లి మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




సిఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప స్వామి పడిపూజ, గ్రామోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం పడిపూజ చేసిన భక్తులు సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు గురు, కేశవ, శ్రీనివాసులు, రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం

సిఐటియు ఆధ్వర్యంలో జీపుజాతా

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత శుక్రవారం మండల కేంద్రం మీదుగా సాగింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, జిల్లా అధ్యక్షులు ఆర్‌వి.నాయుడు, సిఐటియు భవన నిర్మాణం జిల్లా కార్యదర్శి మన్నేల రామాంజనేయులు, పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.కుళ్లాయప్ప, రైతుసంఘం జిల్లా నాయకులు సంజీవరెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, పుల్లయ్య, సంటి, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా నాయకులు ఎర్రినాగప్ప, సుబ్రమణ్యం, అంగన్వాడీ టీచర్లు సుభాషిణి, ఆటో డ్రైవర్లు సూరి, అశోక్, లింగరాజు, పంచాయతీ కార్మికులు నాగరాజు, బాలప్ప, అంగన్వాడీ టీచర్లు, ఆటో డ్రైవర్లు, పంచాయతీ కార్మికులు, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ఈనెల 31వతేదీ నుంచి వచ్చేనెల 4వతేదీ వరకు విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేద్దామని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాయుడు, నాగేంద్ర పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ మహాసభల విజయవంతం కోసం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా శుక్రవారం గుత్తికి చేరుకుంది. ఈ సందర్భంగా గుత్తిలోని గాంధీ కూడలిలో స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల చట్టాలు, హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ జాతీయ మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చించి దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సి.రమేష్, నాయకులు ఎం.మల్లేష్, ఎన్.రేణుక, యు.మల్లికార్జున, సూరి, మురళి, నాయకులు నవీన్ యాదవ్, బాలు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



గుత్తిలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

యాడికి : సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌వి.నాయుడు పిలుపునిచ్చారు. యాడికి మండల కేంద్రంలోని ప్రధాన కూడలికి చేరుకున్న జీపుజాతాలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై దాడి చేసే విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. ముఖ్యంగా లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై జాతీయ మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగేంద్ర కుమార్ ఉపాధ్యక్షులు రామాంజనేయులు, ప్రజానాట్య మండలి శ్రీనివాసులు, పుల్లన్న, మల్లేష్, సిఐటియు నాయకులు మహాలక్ష్మి, బషీర్‌అహ్మద్, మాయకుంట్ల మోహన్, పెద్దన్న, శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శ్రీశ్రీనగర్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి

'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే'లో ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

20ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న శ్రీశ్రీ నగర్ కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని 49, 50వ డివిజన్లలో పర్యటించారు. ఇందులో భాగంగా శ్రీశ్రీ నగర్, గంగానగర్‌లో ఉదయం నుంచి పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో ఎంతో మందికి చెప్పుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ముఖ్యంగా 20ఏళ్లుగా నివాసం ఉంటున్నా పట్టాలు ఇవ్వలేదని వాపోయారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే' పేరుతో మీ ముందుకు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. ఎక్కడికి వెళ్లినా ఐదేళ్లలో ఒక్క నాయకుడు తమ వద్దకు రాలేదని.. తమల్ని పట్టించుకోలేదని ప్రజలు చెబుతున్నారన్నారు. కొన్ని కాలనీల్లో ఏళ్ల తరబడి రోడ్లు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని చెప్పారు. మరోవైపు శ్రీశ్రీనగర్ కాలనీలో అంతా పేదలు ఉంటున్నారని.. గత 20ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నా సరైన గుర్తింపు లేదన్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న వారి డోర్ నెంబర్లు ఆన్ లైన్ లో ఎక్కిస్తామని.. మున్సిపాల్టీ ద్వారా అందే ప్రతి సౌకర్యం కాలనీ వాసులకు వచ్చే చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

వికలాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలాఫెర్రర్-దివ్యాంగుల కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి-నార్పల

వికలాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ పిలుపునిచ్చారు. నార్పలతో పాటు యల్లనూరు, పుట్లూరు, తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు మండలాల వికలాంగులు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నవచైతన్య దివ్యాంగుల కో-ఆపరేటివ్ బ్యాంకును విశాలాఫెర్రర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వికలాంగుల సంఘాల వారు తమ వాటాల రూపంలో ఒక్కొక్కరు రూ.10వేల చొప్పున జమ చేసి 450 మంది వికలాంగులు రూ.45 లక్షలతో సొసైటీని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ బ్యాంకుకు వికలాంగుల నాయకుల నుంచి 15 మందిని బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకుని బ్యాంకు ముందుకు నడుపుతారన్నారు. వికలాంగులు ఆర్థికంగా ఎదగడానికి ఈ బ్యాంకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్లు రఫిక్, నిరంజన్, లక్ష్మణరావు, ఎస్‌టిఎల్ కృష్ణయ్య, ఎటిఎల్ రామాంజనేయులు, గ్రూప్ ఆగ్రనేజర్లు శ్రీనివాసులు, బాలనారాయణ, నాగరాజు, బ్యాంకు అధ్యక్షులు రంగనాథ్, అమీర్, గంగానాయుడు, హరిప్రియ, కుమారి, అరుణమ్మ, వికలాంగులు పాల్గొన్నారు.



దివ్యాంగుల కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభిస్తున్న ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాలాఫెర్రర్

భాస్కర్ అగ్రి సొల్యూషన్ రిటైల్ ఎరువుల లైసెన్సు రద్దు

ప్రజాశక్తి-అనంతపురం

వ్యవసాయ డైరెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిణి ఆదేశాల మేరకు, గుత్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు, అనంతపురం మండల వ్యవసాయ అధికారి వెంకటకుమార్ కలిసి సంయుక్తంగా అనంతపురంలోని శ్రీకంఠం సర్కిల్లో ఉన్న భాస్కర్ అగ్రి సొల్యూషన్స్ రిటైల్ ఎరువుల లైసెన్స్‌ను రద్దు చేశారు. గతంలో నిర్వహించిన తనిఖీల్లో 23.125 మెట్రిక్ టన్నుల ఎరువులు విలువజేసే రూ.5,21,745.90 అమ్మకాలను నిలుపుదల చేశారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకట కుమార్, అనంతపురం సహాయ సంచాలకులు జిఎం. అల్తాఫ్ అలీఖాన్‌ను ఈనెల 12వతేదీన నివేదించారు. ఇందుకు స్పందించిన ఆయన భాస్కర్ అగ్రి సొల్యూషన్స్ వారికి ఈనెల 15న షోకాజ్ నోటీస్ జారీ చేశారు. షోకాజ్ నోటీస్‌కు భాస్కర్ అగ్రి సొల్యూషన్ వారు వివరణ ఇస్తూ అక్రమంగా ఎరువులను నిల్వ చేయడాన్ని ఒప్పుకుంటూ ఈనెల 23న వివరణ ఇచ్చారు. ఈమేరకు భాస్కర్ అగ్రి సొల్యూషన్స్ అనంతపురం వారు రిటెయిల్ ఎరువుల లైసెన్స్‌ను రద్దు చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

పుట్లూరు చెరువు పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలోని చెరువును వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సుబ్బరాయసాగర్‌లో నీళ్లున్నా పుట్లూరు చెరువుకు సకాలంలో నీరివ్వకపోవడం బాధాకరమన్నారు. దీంతో మండల రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. హెచ్చెల్సీ అధికారులు, ప్రభుత్వ వైఫల్యానికి ఇదొక నిదర్శనమన్నారు. అంతేగాకుండా పుట్లూరు చెరువులోని మట్టిని రైతులు తోటల్లోకి తీసుకెళ్తుంటే అధికారులు ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే నాలుగైదు రోజుల్లో పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువుకు నీళ్లివకపోతే నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు పెద్దఎత్తున రైతులు, ప్రజలను కలుపుకుని సుబ్బరాయ సాగర్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న వైసిపి నాయకులు



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయ సముద్రం

ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశించారు. శుక్రవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శింగనమల నియోజకవర్గ పరిధిలోని పలుగ్రామాల ప్రజలతో వివిధ సమస్యలపై ఎమ్మెల్యే శ్రావణిశ్రీ అర్జీలను స్వీకరించారు. ముఖ్యంగా గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలు, పింఛన్లు, హౌసింగ్, విద్యుత్, తదితర అంశాలపై ప్రజల నుంచి ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధించిన శాఖ అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



రోడ్డుపై కమ్ముకున్న పొగమంచు

కప్పేసిన పొగమంచు

ఇబ్బందులు పడిన వాహనదారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటలు అవుతున్నా పొగమంచు తగ్గకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని నిదానంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డంతా పొగమంచు కప్పుపోయింది. పొగమంచుకు సూర్యుడు కూడా చంద్రుల్లాగా కనబడ్డాడు. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

ప్రజాశక్తి దిన పత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పలువురు అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రజాక్‌వలి, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జయరాములు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ విజయలక్ష్మి, ఆర్‌ఐ రామాంజనేయులు, ఎఎ హనుమంతప్ప, హెల్త్ సూపర్‌వైజర్ శాంతకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ రజాక్‌వలి, సిబ్బంది

31వ తేదీనే పింఛన్లు పంపిణీ

నార్పల : మండలవ్యాప్తంగా వృద్ధాప్య, వికలాంగ, వితంతు, సామాజిక పింఛన్లను ఈనెల 31వతేదీనే పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ మమతాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1వతేదీ నూతన సంవత్సరం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈమేరకు మండలవ్యాప్తంగా 31వతేదీనే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గ్రామోత్సవానికి విరాళం

శింగనమల : మండలంలోని తరిమెల గ్రామంలో నిర్వహించనున్న అయ్యప్ప స్వామి గ్రామోత్సవానికి కంచిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి శుక్రవారం రూ.20వేలల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు గురుస్వామి చెన్నయ్య, హరి, నాగన్న, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న కంచిరెడ్డి

గుమ్మఘట్ట ఎస్‌ఐగా చిన్నరాయుడు



గుమ్మఘట్ట : మండల నూతన ఎస్‌ఐగా చిన్నరాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఈశ్వరయ్యను అనంతపురం విఆర్‌కు బదులీ చేశారు. దీంతో కుందుర్పి మండలంలో విధులు నిర్వహిస్తున్న చిన్నరాయుడును గుమ్మఘట్టకు వచ్చి బాధ్యతలు చేపట్టారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2000వ సంవత్సరంలో ఎంబిబిఎస్ చదువుకున్న పూర్వ విద్యార్థులు నేడు స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు, ప్రభుత్వ సర్వజన వైద్యశాల జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో హైలైట్స్‌గా కళాశాల, ఆసుపత్రి సందర్శనతో పాటు, ప్రస్తుత సిబ్బందితో సమావేశం నిర్వహించి వైద్య కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారాన్ని ఏ విధంగా అందించగలమో తెలుసుకునే ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు. అలాగే తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించుకోనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మౌలాలీబాషా, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ కుల్దీప్, డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన టిడిపి జిల్లా అధ్యక్షులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి భరత్‌ను నూతనంగా నియమితులైన అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు శుక్రవారం కర్నూలులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు శాలువా కప్పి పూలబొకే అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ దబ్బర కుమార్‌స్వామి, ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, టిడిపి వాల్మీకి, బోయ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మణిరవి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి బొకే అందజేస్తున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం కారును వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. వివరాల్లోకి వెళ్తే.. గుత్తి మండలం కొత్తపేట శివారులో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కారు వెళ్తోంది. అయితే కర్నూలు నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి కారును వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో కారు వెనుక అద్దం పగిలి పోగా, డిక్కీ డోరు ధ్వంసమైంది. త్రుటిలో పెనుప్రమాదం తప్పి కారులో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కారును వెనుక నుంచి బస్సు ఢీకొట్టడంతో ప్రయాణికులు, డ్రైవర్ భయాందోళన చెందారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు, బస్సు

ప్రజాశక్తి
www.prajasakti.com

న్యాయమిత్ర పథకం అమలు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర పథకాన్ని అమలు చేసి ఆదుకోవాలని న్యాయవాదులు కోరారు. ఈ మేరకు శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నేరువప్ప ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం అంబేద్కర్ సర్కిల్ వరకు న్యాయవాదులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ లో నినాదాలు చేస్తూ న్యాయమిత్ర అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు వన్నేరువప్ప, రామచంద్రారెడ్డి, ఇందాద్ మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులను ఆదుకునేందుకు లా నేస్తం పథకం కింద ప్రతినెలా రూ.5 వేలు అందిస్తూ ఆదుకోవడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి రాకముందు ప్రస్తుత మంత్రి నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే జూనియర్ న్యాయవాదులను ఆదుకునేందుకు ప్రతినెల న్యాయమిత్ర పథకం పేరిట అర్హులైన వారందరికీ రూ.10 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే జూనియర్ న్యాయవాదులను ఆదుకునేందుకు న్యాయమిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, మురళి, ఉదయ్ సింహారెడ్డి, అబ్దుల్లా, అజయ్, బాబావలి, రసూల్ బి, పవిత్ర, భరత్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదుదలు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి స్పెషల్ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్, బాలకృష్ణ పిఏలు శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో పట్టణ వ్యాప్తంగా 38 వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పైన వచ్చిన అర్జీలను వారు స్వీకరించారు. పట్టణంలో వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు తాము ప్రభుత్వం నిర్దేశించిన విధంగా టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకుని ఆరు మాసాలు అవుతున్నప్పటికీ తమకు టైలరింగ్ మిషన్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. పలువురు మహిళలు తమకు సొంత ఇల్లు లేదని ఇంటి స్థలాలను కేటాయించాలని ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఆటోనగర్ లో నివాసముంటున్న షేక్ షావలికి 90 శాతం వికలాంగత్వం ఉందని, రూ. 15 వేలు పెన్షన్ ఇవ్వాల్సి ఉంటే రూ. 6 వేలు ఇస్తున్నారని వికలాంగుడిని ఎత్తుకొని గ్రీవెన్స్ వద్దకు వచ్చి చూపించి సమస్యను ప్రజాప్రతినిధులు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, మీడియ కోఆర్డినేటర్ చంద్రమోహన్, ఇతర టిడిపి నాయకులు, అన్ని శాఖల అధికారులతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



90 శాతం వికలాంగత్వం ఉన్నా రూ.15వేలు పింఛన్ రావడం లేదని ఫిర్యాదు చేస్తున్న బాధితులు



మంచానికే పరిమితమైన పింఛన్‌కు నోచుకోని వికలాంగుడు



టైలరింగ్ మిషన్‌లు ఇవ్వలేదని ఫిర్యాదు చేస్తున్న మహిళలు

శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలి

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శాంతి భద్రతల విషయంలో ఎక్కడ రాజీ పడవద్దని అత్యంత కఠినంగా వ్యవహరించాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర పుట్టపర్తి సబ్ డివిజనల్ పోలీస్ అధికారులకు సూచించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర నియోజవర్గంలో శాంతి భద్రతలపై సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి డి.ఎస్.పి విజయ్ కుమార్ నల్లమాడ సిఐ శ్రీనివాసులు ,పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, ఆమడ గూరు మండల ఎస్ ఐ గోపాలకృష్ణ, పుట్టపర్తి రూరల్ ఎస్ఐ క్రాంతితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీస్ శాఖ పనిచేయాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలోనీ గ్రామాల్లో ఎక్కడా ఫ్యాక్షనిజం రౌడీయిజం మహిళలపై,బాలికలపై అఘాయిత్యాలకు తావు లేకుండా కఠినంగా పోలీస్ శాఖ పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో జూదం ,మట్కా ,వ్యభిచారం, క్రికెట్ బ్యాటింగ్ , ఆన్ లైన్ బెట్టింగ్ , సైబర్ నేరాలు పూర్తిగా కట్టడి చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. పోలీసులంటే ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ సబ్ డివిజన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



శాంతిభద్రతల విషయంపై పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చట్టాలపై అవగాహన అవసరం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని ఎస్ఐ రాజశేఖర్ చెప్పారు. ధర్మవరం రూరల్ రేగాటిపల్లి పంచాయతీ ముచ్చురామి గ్రామంలో శుక్రవారం ధర్మవరం రూరల్ ఎస్ ఐ రాజశేఖర్ తమ సిబ్బంది తో గ్రామ సభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌కు సన్మానం


ప్రజాశక్తి - నలచెరువు

మండల పరిధి లోని ఇందుకూరి వారి పల్లిలో టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్ బాబుకు టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తనను రెండవ సారి కన్వీనర్‌గా నియమించినందుకు కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ కు. తమ ఎన్నికకు సహకరించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు. ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రమణారెడ్డి. మాజీ ఎంపీపీ రాజారెడ్డి. మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి. పంతల చెరువు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఉత్తన్న. యువ నాయకులు రమణారెడ్డి. మాజీ సింగల్ విండో ప్రెసిడెంట్ ఎద్దుల అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.



టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన 2026 సంవత్సరం పిక్చర్, నంబర్ క్యాలెండర్, డైరీలను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆవిష్కరించారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజాశక్తి సిబ్బందితో కలిసి వాటిని విడుదల చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కురుబ హనుమంతు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాలు పురుషోత్తం, టిడిపి పార్లమెంట్ కోశాధికారి మహబూబ్‌బాషా, అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, ప్రసన్నవెంకటరమణస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు గాజుల వెంకటేశులు, నాయకులు ఇనాయత్‌బాషా, తిప్పేస్వామి, సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.

యూరియా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి- అమడగూరు

మండలంలోని జేకే పల్లిలో యూరియా కేంద్రాన్ని కదిరి ఆర్డీవో వి.వి.శర్మ శుక్రవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు యూరియా కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. రైతులకు యూరియా అవసరం ఎంతవరకు ఉందని అడిగి తెలుసుకున్నారు. మండలానికి 60మెట్రిక్ టన్నులు అవసరం ఉన్నట్లు ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపినట్లు వ్యవసాయ అధికారి వెంకటరమణాచారి తెలిపారు. అనంతరం ఆర్డీఓ తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.భూ రీసర్వే,గ్రీవెన్స్, భూసమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామనాథ్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ మహేశ్వర్ రెడ్డి,వీఆర్వో లు, రెవెన్యూ, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ముదిగుబ్బ మండల నూతన అధ్యక్షులు గా రామాంజనేయులు నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కదిరి పట్టణంలోని ఎజీజిఓ హోంలో జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు అధ్యక్షతన హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి సునీల్ కుమార్ ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున వ్యవహరించారు. ముదిగుబ్బ మండల మండల గౌరవ అధ్యక్షులుగా సి విరూపాక్ష , అధ్యక్షులుగా రామాంజనేయులు నాయక్, ఉపాధ్యక్షులుగాబాబా ఫక్రుద్దీన్, కరుణ మెర్సీ ,ప్రధాన కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా మమత, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వెంకట నారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా షాకీర్, కార్యదర్శులుగా ప్రమీల, రామ్మోహన్, హరి కుమార్ ఎన్నికయ్యారు. వీరికి జిల్లా కార్యదర్శి తాహెర్ వలి,రవివర్ధన్ రెడ్డి, ఖాజా, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని సిద్దేశ్వర కాలనీలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం నగర సంకీర్తన, గ్రామోత్సవం, రథోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యప్పస్వామి విగ్రహానికి వివిధ అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి శాంతినగర్ నుంచి బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్, ఓబుళా చారి రోడ్డు మీదుగా తిరిగి అయ్యప్పస్వామి ఆలయం వరకూ ఊరేగించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివప్రసాద్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పట్టణ ప్రజలు, ప్రముఖులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు టంకశాల హనుమంతు, గురుస్వాములు తాడూరు సిద్దేశ్వర్, బంగిశివ, కృష్ణ, రమేష్‌శెట్టి, రామ్‌ప్రసాద్, తిమ్మరాజు, ఎల్లప్ప, మహిళలు, పుర ప్రజలు పాల్గొన్నారు.



రాయదుర్గంలో నిర్వహించిన గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు



గ్రామస్తులతో కలిసి భూములు పరిశీలిస్తున్న అధికారులు

నిషేధిత భూమిలో క్రయవిక్రయాలు జరపొద్దు : తహశీల్దార్

ప్రజాశక్తి -నంబులపూలకుంట

నిషేధిత భూమిలో క్రయవిక్రయాలు జరపరాదని తహశీల్దార్ దేవేంద్రనాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని 'ప్రభుత్వ భూమిపై కబ్జా దారుల కన్ను' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి తహశీల్దార్ స్పందించారు. శుక్రవారం రెవిన్యూ సిబ్బందితో కలిసి ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 573 ని కొలతలు వేసి నిగ్గు తేల్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 573, విస్తీర్ణం 78 సెట్లు ప్రస్తుతం నిషేదిత జాబితాలో ఉందనిఈ భూమిని అమ్మాలన్న కొనాలన్న జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి అని చెప్పారు. ఈ కార్యక్రమం మండల సర్వేయర్ ప్రభంజన్ రెడ్డి, సర్వేయర్ ఉపేంద్ర, విఆర్ఒ నాగరాణి, రెవిన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులతో వైద్యం

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రంలో కాలం చెల్లిన మందులతో ఓ వ్యక్తి బెంగళూరులోని సెయింట్ జాన్స్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే ఓ నిరుపేద ద్విచక్ర వాహనాల మెకానిక్ రామచంద్ర పనిచేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం చలి, జ్వరంతో బాధపడుతూ మండలకేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఏ మందు ఇచ్చారో తెలియదు కానీ రోగికి కాలం చెల్లిన మందుతో రివర్స్ అయ్యి కోమాలోకి వెళ్లాడు. ఇప్పటికే దాదాపు రూ.5 లక్షల పైగా ఖర్చులు అయినట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయమై డిఎంహెచ్ఓ ఫైరోజా బేగం ను వివరణ అడగగా డివిజన్ లెవెల్ మెడికల్ ఆఫీసర్ పంపి విచారణ చేపడతామని నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులు ఐక్యూ పెంచుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యార్థులు తమ మేదస్సును పెంచుకోవడం కోసం ప్రతిరోజు వ్యాయామం , యోగ నిర్వహించాలని రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని జగరాజుపల్లిలో గల కేజీబీవీ లో విద్యార్థులతో మేధస్సు పెంచుకోవడం ఎలా అన్న అంశంపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిన్న అన్నం నీళ్ల గాలి వల్ల వచ్చిన శక్తిని ఏ విషయాలకు సద్వినియోగం చేయాలన్న జ్ఞానం కలిగి ఉండాలని చెప్పారు. అనవసరమైన పనులకు కేటాయించే శక్తిని తనలో నిలుపుకుంటే అదే శక్తి మేధాశక్తిని పెంచి ఐక్యూ లెవెల్ ను పెంచి ఉన్నతమైన ఉత్తమమైన ఆలోచనలు పనులు చేయగలు గుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన పూర్తి చేయాలి

ధర్మవరం రూరల్ : స్థానిక ఎన్నికలలోపు కుల గణన నిర్వహించాలని యాదవ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని జయకృష్ణ స్వామి దేవస్థానంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు లక్ష్మి నరసప్ప యాదవ్, డాక్టర్ వివేక్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గ యాదవ సంఘం ప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా లోని యాదవుల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, కుల గణన అంశాలపై విస్తృతంగా చర్చ నిర్వహించామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పించాలని, హక్కుల సాధన కోసం ఐక్య పోరాటం చేయాలని, గ్రామస్థాయి నుంచి చట్టసభల వరకు సమతుల్య అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలలో అత్యధిక జనాభా కలిగిన యాదవులకు తగిన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, నియోజకవర్గ యాదవ సాధికారిక అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ఎంపీటీసీ బిల్వంపల్లి కేశవ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బాల ఆంజనేయులు యాదవ్, నాగేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అర్ధాంతరంగా ఆగిన బుక్కపట్నం మండలంలోని శ్రీ సత్య సాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని యుఎస్ఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో అప్పటి అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం శాశ్వత భవన నిర్మాణ పనులను ప్రారంభించిందన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. దీంతో స్కూల్ విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులకు ప్రయోగశాలలు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ కళాశాల భవన నిర్మాణాలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలంలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని సోమఘట్ట పంచాయతీ పరిధిలోని ఎస్. కొత్తపల్లి మలుపు వద్ద తమిళనాడు రిజిస్ట్రేషన్‌కు చెందిన ఓ కారు శుక్రవారం ఉదయం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మంచు ప్రభావమా. లేక అతివేగం వల్లనో ప్రమాదం జరిగి ఉండే అవకాశం ఉండొచ్చని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - అమడగూరు

మండల పరిధిలోని కసముద్రం సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. కొలిమిరాళ్ల పల్లికి చెందిన చరణ్,కంచనగారిపల్లి కి చెందిన మోక్షజ్ఞ ఇద్దరూ మోడల్ స్కూల్ లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.చరణ్ బంధువులు చనిపోయారని విషయం తెలియడంతో ఇద్దరూ కాలేజ్ లో అధ్యాపకులను అడిగి టివిఎస్ ఎక్సల్ ద్విచక్ర వాహనంలో వెళ్లారు. కస్సముద్రం సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందికి పడ్డారు.ఈ ప్రమాదంలో చరణ్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. మోక్షజ్ఞకి స్వల్ప గాయాలు అయ్యాయని తెలిపారు.వెంటనే స్థానికులు 108 అంబులెన్సు సమాచారం ఇచ్చి మెరుగైన చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యేకు కవితాబొజ్జన్న సన్మానం



అమిలినేని సన్మానిస్తున్న కవితా బొజ్జన్న, నాయకులు

ప్రజాశక్తి-శెట్టూరు

అనంతపురం జిల్లా పార్లమెంట్ కార్యనిర్వాహక కారదర్శిగా ఎన్నికైన గొళ్ల గ్రామపంచాయతీ సర్పంచి కవితాబొజ్జన్న, మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొళ్ల లక్ష్మీదేవిరమేష్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్ శుక్రవారం కళ్యాణదుర్గం పట్టణంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి గజమాల వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తనకు ఈ అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షులు పూల నాగరాజులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లాపురప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లిపల్లి నారాయణ, నాయకులు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కెఎంసిలో రూ. 50 కోట్లతో నాలెడ్జ్ సెంటర్

-మంత్రి దృష్టికి ఆయా విభాగాల సమస్యలు

జిజిహెచ్ సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు మెడికల్ కాలేజీలో పూర్వపు విద్యార్థుల కృషితో నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. జిజిహెచ్ వివిధ విభాగాల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి టిజి. భరత్ అన్నారు.శుక్రవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో మెడికల్ కాలేజీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని పరిశ్రమలు, వాణిజ్యం , ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ విదేశాల్లో నివసిస్తున్న కెఎంసి పూర్వ విద్యార్థులు కాలేజీ రుణం తీర్చుకునే ఉద్దేశంతో రూ.50 కోట్లతో ప్రస్తుత విద్యార్థులు , సిబ్బందికి ఉపయోగపడే నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయటానికి ముందుకు వచ్చారన్నారు. అందుకు అందరికీ ఆమోద యోగ్యమైన 66.66 సెంట్ల స్థలంలో నాలెడ్జ్ సెంటర్ (ఇందులో అడ్వాన్స్‌డ్ లైబ్రరీ, రీసెర్చ్ సెంటర్, జిమ్ , పెవిలియన్, ఇండోర్ గేమ్స్ కాంప్లెక్స్, మీటింగ్ హాల్ మొదలగు సదుపాయాలు) సంవత్సరం లోపల ఏర్పాటు చేస్తామన్నారు. భవనం పూర్తయిన తర్వాత దీన్ని మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ కు అప్పగిస్తామన్నారు. మెడికల్ కాలేజీ సిబ్బంది అందరిని అభిప్రాయం , ఆమోదం తెలపాలని కోరారు. నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి మెడికల్ కాలేజీ సిబ్బంది అందరూ ముక్త కంఠంతో ఆమోదం తెలిపారు. ఆమోదం తెలిపిన సిబ్బంది అందరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ కంటి ఆసుపత్రిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, భవనం పాతబడిపోయి పెచ్చులు ఊడుతుందని తెలపాగా సర్వజన ఆసుపత్రి లాగ ఆ పనులను జరిగేలాగా చూస్తామని మంత్రి తెలిపారు. ఆప్టికల్ సోనోగ్రఫీ అన్న పరికరం అవసరం ఉందని తెలుపగా వెంటనే ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిధుల కొరత వల్ల ఐపిఎం బిల్డింగ్ అసంపూర్తిగా ఆగిపోయి ఉన్నదని, నిధులు కేటాయిస్తే త్వరగా పూర్తవుతుందని తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వారి ద్వారా రూ. 14.16 కోట్లతో 150 బెడ్ల రోగుల సహాయకులకు రాత్రి బస నిమిత్తం నేషనల్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్ వారి ద్వారా భవన నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రికి వివరించారు. కెఎంసి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్ మాట్లాడుతూ మెడికల్ కాలేజ్ మెన్స్ హాస్టల్‌కు 150 మందికి సరిపోయే గదులు అవసరమని, మార్చురీ దగ్గర ఒక షెడ్ అవసరం ఉందని , ఫ్రీజర్ బాక్స్‌లు అవసరం ఉన్నాయని తెలిపారు. ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేద రోగులకు ఇంప్లాంట్స్ ప్రభుత్వం తరపున ఉచితంగా ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో వేయిస్తే బాగుంటుందని కోరగా ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడుతామని మంత్రి తెలిపారు. ఆయా విభాగాల అధిపతులు అడిగిన అన్ని ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. అన్నింటిని పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. విదేశీవైద్య విద్య విద్యార్థుల సమన్వయకర్త డాక్టర్ కెజి. గోవిందరెడ్డి, ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్, రఘునాథ్ రెడ్డి , జగదీష్, సాయి ప్రదీప్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం , అన్ని విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు లేని లోటు తీర్చలేనిది : సిపిఎం

ప్రజాశక్తి-పాములపాడు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జెల్లి నాగేశ్వరరావు లేని లోటు తీర్చలేనిదని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన నాగేశ్వరరావు అంత్యక్రియలు నంద్యాల జిల్లా పాములపాడు మండలం లింగాలలో నిర్వహించారు. ఉదయం కర్నూలులో ఆయన తుదిశ్వాస విడిచారు. అనంతరం కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీలోని ఆయన నివాసలో ప్రజల సందర్శనార్థం మధ్యాహ్నం వరకు ఉంచారు. అనంతరం భౌతిక కాయాన్ని లింగాలకు తరలించారు. లింగాలలో నాగేశ్వరరావు రెండో అన్న వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీనివాసులు అంతిమసంస్కారం నిర్వహించారు. లింగాలలో ఆయనను ఖననం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభ లింగాల వాసి సీనియర్ సిపిఎం నాయకులు జె.రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ నాగేశ్వర్‌రావు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా , డివైఎఫ్ఐ నాయకునిగా , సిఐటియు జిల్లా నాయకునిగా, సిపిఎం పూర్తి కాలం కార్యకర్తగా అనేక ఉద్యమాలలో పాల్గొన్నారని అన్నారు. అనేక నిర్బంధాలను ఎదుర్కొని ఆయన నమ్మిన ఆశయం కోసం చివరిదాకా పని చేశారని కొనియాడారు. సిఐటియు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడుతూ నాగేశ్వరరావు చివరిదాకా ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారని అన్నారు. లింగాల సీనియర్ నాయకులు రామేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఉద్యమం బలోపేతానికి పని చేయడంతోపాటు, లింగాల అభివృద్ధికి కూడా కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం, కర్నూలు, నంద్యాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.